# సంపాదకీయము

పూజ్య బాబూజీ గారి జన్మదినము మళ్ళీ వచ్చింది. విశిష్ఠమూర్తిమత్వము ఆవిర్భవించి 62 ఏళ్ళు గడచాయి. అయన ప్రవేశపెట్టిన సత్యపథము మానవాళిపై తన ప్రభావమును రోజు రోజుకూ పెంచుకొంటూపోతున్నది. సుమారుగా 4 లక్షల సాధకులు వారి మార్గంలో ఏదో ఒక రీతిలో తమ జీవన గమ్యాన్ని చేరుకోవాలని కాంక్షిస్తున్నారు. వారిలో గురుమతావలంబులు కొందరైతే మన్మతావలంబులు (తమ మతమే ఆదరణీయమని నమ్మే వారు) కొందరు. మన మతం (అభిప్రాయము) మనకు అన్నివేళలా సమ్మతమనే నమ్మకం, అదే యితరులకు కూడా సమ్మతము కావాలనే దృఢనిర్ణయము కొందరిలో తరచూ కలుగుతుంటుంది. పైగా అట్టి మతము గురుమతముగానూ యుండాలనీ, దానినే భగవంతుడూ ఆమోదించాలనీ నిర్ణయించుకొని, గురువు గారికి భగవంతునికీ కూడా ఎంతో కొంత యిచ్చుకొనటానికి సమ్మతము తమలో తామే అనుకొని, అట్టి మతము జరగనిచో గురువు గారు, కొన్ని సందర్భములలో దైవము కూడ నిష్ప్రయోజకునిగా నిర్ధారించి తమ మతానికి సరిపోవు దైవమునుగాని గురువునిగాని అన్వేషిస్తుంటారు. ప్రాపంచిక విషయాలలోనైతే మన మానసిక దౌర్భల్యము గురించి మనకెరుకే కాబట్టి కాస్తంత అవగాహన గలిగి యుండవచ్చు. ఆధ్యాత్మిక సాధనలోనూ యిదే వైఖరైతే అర్థంచేసుకోవడము కష్టం. ప్రార్థనా పద్ధతి, క్షాళనా క్రియలు, నిర్ణయించబడిన ధ్యాన పద్ధతులను మన గురువుగారు ఉపదేశించిన విధంగానే చెయ్యాలి. వీటిలో మార్పులు మన్మాతానుగుణమయితే మనకు గలుగు పురోగతిగూడ దాని కనుగుణంగానే యుంటుంది. దీని గురించి ప్రస్తావన ఎందుకంటే యిటీవలి కాలంలో కొందరు నాకు వ్రాయు లేఖల్లో అట్టి మార్పులు చేసినట్లు వ్రాశారు. ఆహా, మన్మతమెంత బలీయమైనదోయని ఆశ్చర్యపోయి మీతో పంచుకొందామనియూ, దాని బారినుండి రక్షించుకోమని తెలియచేద్దామనీనూ. సాధన యంతయూ మనకు భిక్షార్హత కల్పించడానికే యని నా నమ్మకము. పూజ్య బాబూజీ గారు చెప్పినట్లు యదార్ధమునకు మనమందరమూ యాచకులమే, కాని ఆధ్యాత్మికతలో యాచక పాత్ర ఖాళీగానే యుండాలి. పచ్చిపులుసయినా, పరమాన్నమయినా గురుకృపగా భావించాలి. అదే నిజమయిన గురుమతావలంబన. అట్టి భాగ్యము మనకందరికీ యున్నదనే నా నమ్మకం. తథాస్తు.

వైశాఖ.బ.పంచమి

(బాబూజీ జన్మదిన సంచిక : 2006 13-2)